క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

లోకేశ్వరం: మండలంలోని బిలోలి, బాగాపూర్, సాథ్గాం, హవర్గ, సేవాలాల్‌తండా గ్రామాల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈమేరకు మంగళవారం దేగాంలోని తన నివాసంలో ఆయా గ్రామాల నాయకులకు రూ.2.85లక్షల విలువైన చెక్కులను ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అందజేశారు. లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ముత్తగౌడ్, శేఖర్‌రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు సాయారెడ్డి, ఉత్తం, దిగంబర్ ఉన్నారు.

పాఠశాల సందర్శన

కడెం: మండలంలోని లక్ష్మీసాగర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎఫ్ఎల్ఎస్ మండల నోడల్ అధికారి డీ.ఎల్.ఎస్ చారి సందర్శించారు.మనఊరు–మనబడిలో భాగంగా పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం మహేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఎంపీడీవో పర్యటన



ధనిలో మైదానం వద్ద ఎంపీడీఓ సరోజ

సారంగపూర్: మండలంలోని ధని, చించోలి(బి) గ్రామాల్లో మంగళవారం ఎంపీడీఓ సరోజ పర్యటించారు. ఈసందర్భంగా పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, సెగ్రిగేషన్ షెడ్లు, అంగన్వాడీ కేంద్రాలు, మన ఊరు–మనబడిలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అభివృద్ధి పనులు వేగవంతం చేయడంతోపాటు గ్రామాలను నిత్యం శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యదర్శులు శ్రీనివాస్, ఫిషాన్, తదితరులు ఉన్నారు.

సమావేశం

మామడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ప్రాథమిక స్థాయిలో ఎఫ్ఎల్ఎస్‌పై ఉపాధ్యాయులు చర్చించారు. పాఠ్యాంశాల బోధన, విద్యార్థుల ప్రగతి వివరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నరసింహస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థిని ప్రతిభ

తానూరు: కరాటే అసోసియేషన్ ఆఫ్ నల్గొండ జిల్లా ఆధ్వర్యంలో గత నెల 26న నిర్వహించిన షోటోకస్ తెలంగాణ స్టేట్ కరాటే టోర్నమెంట్‌లో తానూరు వాగ్దేవి పాఠశాల విద్యార్థిని పి.చైతన్య (ఆరోతరగతి) ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ అరవింద్‌రెడ్డి తెలిపారు. కాంస్యం, ప్రశంసాపత్రం సాధించిన విద్యార్థిని మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కుంటాల: మండలంలోని అందకూర్ మహాలక్ష్మీ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి గ్రామానికే చెందిన ఉపాధ్యాయులు సగ్గం గంగాధర్ తన వంతుగా రూ.11వేలను విరాళంగా అందజేశారు. సర్పంచ్ దాసరి కిషన్, ఎంపీటీసీ మధుకర్ తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: అగ్గిమల్లన్న ఆలయ అభివృద్ధికి రూ.మూడు లక్షలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ హామీ ఇచ్చారు. మండలంలోని తర్లపాడ్ గ్రామంలో అగ్గిమల్లన్న ఆలయ ప్రాంతంలో మంగళవారం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పుప్పాల శంకర్, పెద్దిన ర్సయ్య, నాగేశ్, పెద్ది మల్లేశ్, మహేశ్, బీరయ్య తదితరులు ఉన్నారు.

‘కేంద్రంపై నిందలు సరికాదు’

లక్ష్మణచాంద: సీఎం కేసీఆర్ రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడుతూ కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదని బీజేపీ నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. మంగళవారం మండలంలోని తిర్పెల్లి గ్రామంలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో మహిళలకు రక్షణ లేదన్నారు. ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధిస్తున్నా.. నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి గంగాధర్, చిన్నయ్య, రంజిత్, రాజు, అశోక్, రాజేశ్వర్, భూపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నతనంలోనే విజ్ఞానం నేర్చుకోవాలి

- పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు
- సీవీ రామన్ చిత్రపటానికి నివాళి



భైంసాలో ప్రయోగం చేస్తున్న మైనార్టీ గురుకులం విద్యార్థులు



కడెం: అంబారిపేట్‌లో ఎంపీపీ అలెగ్జాండర్



ఖానాపూర్: బీర్నందిలో తిలకిస్తున్న టీచర్లు



ముధోల్ బాలికల ఉన్నత పాఠశాలలో..



సారంగపూర్ వివేకానంద పాఠశాలలో..



తానూర్: ఎల్వీలో ఉపాధ్యాయులకు సన్మానం



నర్సాపూర్(జి)లో టీచర్లకు వివరిస్తున్న విద్యార్థులు



మామడ: కొరిటికల్ పాఠశాలలో



కుభీర్‌లో మేళా తిలకిస్తున్న ఎస్సై షరీఫ్



నిర్మల్‌లో విజయ హైస్కూల్‌లో బాల శాస్త్రవేత్తలు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్సు దినోత్సవం నిర్వహించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు నిర్వహించిన సైన్స్‌ఫేర్ ఆకట్టుకుంది. ఉత్తమ ప్రదర్శనలు చేసిన చిన్నారులకు బహుమతులు అందించారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే విజ్ఞానం నేర్చుకోవాలని సూచించారు. విజయ హైస్కూల్, జుమ్మెరాత్‌పేట్, శ్రీచైతన్య పాఠశాలల్లో విద్యార్థుల వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని బీర్నంది, మస్కాపూర్ జెడ్పీఎస్ఎస్‌తోపాటు ఖానాపూర్ ఏసీఈ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఉపాధ్యాయుడు ప్రకాశ్ ఆధ్వర్యంలో 1965 నుంచి మన దేశంతోపాటు విదేశాల్లో చలామణిలో ఉన్న నాణేలు, కరెన్సీనోట్లు ప్రదర్శించారు. హెచ్ఎం సాయికృష్ణ ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. మస్కాపూర్ గ్రామ పాఠశాలలో హెచ్ఎం బాలాజీ ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్, ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఉపాధ్యాయులు గంగన్న, వెంకటాద్రి, బీర్నంది సర్పంచ్ సువర్ణ, మస్కాపూర్ సర్పంచ్ మహేందర్, ఎంపీటీసీ స్వప్న, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, భూమేశ్, కృష్ణ పాల్గొన్నారు.

సారంగపూర్: మండలకేంద్రంలోని వివేకానంద పాఠశాలలో సైన్స్‌ఫేర్ నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించగా విజేతలకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ రమణారావు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మామడ: మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. శాస్త్రవేత్త సి.వి.రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాల, కుంటాల ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు గజపల్లి నర్సయ్య, ఎల్లన్న పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయులు మాధవ్‌రావ్, సుదర్శన్‌ను సిబ్బంది ఘనంగా సన్మానించారు. కస్తూర్బాలో ప్రయోగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు భూమన్నయాదవ్ ,ఉపాధ్యాయులు రమేశ్, నర్సయ్య, గంగారాణి, కస్తూర్బా ప్రిన్సిపాల్ జ్యోతి పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని చింతల్‌బోరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు నంగి కృష్ణ తదితరులు ఉన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని అక్షర, రబీంద్ర బాలికల ఉన్నత పాఠశాల, శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలల్లో విద్యార్థులు సోలార్, పర్యావరణ పరిరక్షణ, ప్రాజెక్టుల నిర్మాణం, భూగోళం, నీటి శుద్ధీకరణలపై ప్రయోగాలు ప్రదర్శించారు. సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు సాయినాథ్, రాజు, సుభాశ్ ఉన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులంతోపాటు మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, గుజిరిగల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థులు సైన్స్ ప్రదర్శనలు చేశారు.

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామ జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన సైన్సు మేళాకు ఎంపీపీ అలెగ్జాండర్ హాజరై ప్రయోగాలు పరిశీలించారు. పాఠశాల గ్రంథాలయంలో పుస్తకాల ఏర్పాటుకు తన వంతుగా రూ.పది వేలను విరాళంగా అందజేశారు. ఎంపీటీసీ సింధూజ, సిబ్బంది ఉన్నారు.

పెంబి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైన్సు ప్రాజెక్టులను ప్రదర్శించారు. కేజీబీవీ ఎస్‌వో వీణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

కుభీర్: మండల కేంద్రంలోని అభ్యాస ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో విజ్ఞాన మేళా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు పలు ప్రదర్శనలు ప్రదర్శించారు. ఎస్సై.ఎండీ.షరీఫ్, ప్రధానోపాధ్యాయుడు నరేశ్, తదితరులు పాల్గొన్నారు.



భైంసారూరల్: చింతల్‌బోరి పాఠశాలలో..



కుంటాల: పెంచికల్‌పాడ్ పాఠశాలలో..

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాట	20
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : సార్
నారాయణ: వాల్తేరు వీరయ్య

అగ్గితెగులు నివారణ చర్యలు చేపట్టాలి

లోకేశ్వరం: వరి పంటలో అగ్గితెగులు నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి గణేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని బాగాపూర్ గ్రామంలో సాగు చేసిన వరి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈవో మౌనిక, కృష్ణారెడ్డి ఉన్నారు.

లక్ష్మణచాంద: సోన్ మండల కేంద్రంలో వరి పంటలను ఏఈవో అంబాజీ పరిశీలించారు. ఈసందర్భంగా అగ్గితెగులు సోకితే నత్రజని వినియోగాన్ని తాత్కాలికంగా నిలిపివేయడంతోపాటు లీటర్ నీటికి 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ మందు కలిపి పిచికారీ చేయాలని ఏఈవో సూచించారు.

కాలనీల్లో వార్డు సభలు

ఖానాపూర్: పట్టణంలోని పలు కాలనీల్లో మంగళవారం డబుల్ బెడ్‌రూం దరఖాస్తుల జాబితా ప్రదర్శనపై వార్డుసభలు నిర్వహించారు. లబ్ధిదారుల ఎంపికపై తుది జాబితాను ప్రత్యేకాధికారులు సభల్లో ప్రదర్శించారని మున్సిపల్ కమిషనర్ రత్నాకర్ రావు తెలిపారు.

గ్రామాల్లో నీటి సమస్య రానీయొద్దు

- కుభీర్ మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ లక్ష్మిబాయి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మిబాయి

కుభీర్: గ్రామాల్లో తాగునీటి సమస్య రానీయకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ లక్ష్మిబాయి అధికారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో కుభీర్ మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సర్వెల్లి(హెచ్)సర్పంచ్ పబ్బు రాజేందర్ మాట్లాడుతూ.. తమ గ్రామంలో ఇనుప విద్యుత్ స్తంభాలకు కరెంట్‌షాక్‌తో ఇటీవల మేకలు చనిపోయాయన్నారు. వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరగా స్పందించిన విద్యుత్తు ఏఈ అజిజొద్దీన్ సమస్యను పరిష్కరిస్తామని సమాధానమిచ్చారు.మొక్కజొన్న కుప్పలను విద్యుత్ తీగల కింద పోయవద్దని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. మండలంలో కొనసాగుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని అందరూ ఉపయోగించుకునేలా చూడాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయానికి ఇబ్బంది రాకుండా త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేయాలని సూచించారు. ఎంపీవో కవిరాజు, జెడ్పీటీసీ చవాన్ అల్కాతాయి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లపల్లిలో మంత్రి ఐకేరెడ్డి పూజలు



పూజలు చేస్తున్న మంత్రి అల్లోల దంపతులు

నిర్మల్‌రూరల్: మండలంలోని ఎల్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయ శివపంచాయతన నర్సింహస్వామి ఆలయ వేడుకలకు మంగళవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సతీసమేతంగా హాజరయ్యారు. ఈసందర్భంగా మహాకుంభప్రోక్షణ, ప్రాణప్రతిష్ఠ విగ్రహాలకు మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించి బుధవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నారు. మంత్రి మాట్లాడుతూ ఆలయాన్ని రూ.85 లక్షలతో నిర్మించినట్లు తెలిపారు. పారిశ్రామికవేత్త మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, ముఠాపూర్ పీఏసీఎస్ చైర్మన్ గంగాధర్, సర్పంచ్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. యంత్రాన్ని గాలికొదిలేశారు..



లోకేశ్వరం: డీసీఎమ్మెస్ ద్వారా ఖరీఫ్‌లో ధాన్యం కొనే సమయంలో పంటలో తప్ప, తాలు లేకుండా చూడాలని కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వం ప్యాడి క్లీనర్లను సరఫరా చేసింది. మండలంలోని జోహర్‌పూర్‌లో పంట కొనుగోలు పూర్తయిన తర్వాత ఈ యంత్రాన్ని భద్రపరచకుండా వదిలేశారు. దీంతో కొనుగోలు కేంద్రంలోనే ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ దెబ్బతింటుంది. అధికారులు స్పందించి గ్రామంలో భద్రపరచాలని రైతులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: బాలకిషన్, ఆర్ఐ,లోకేశ్వరం ఫోన్: 9701642470

సంఘం బలోపేతానికి కృషి

కుంటాల: మున్నూరుకాపు సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ సంఘం తాలుక కన్వీనర్ రోళ్ల రమేశ్ పేర్కొన్నారు. మండలంలోని దౌనెల్లి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్నూరుకాపు సోదరులు, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని కోరారు. సంఘం మండల కన్వీనర్ గోవింద్ రాజు, సలహాదారులు శంకర్, సభ్యులు సాయిలు, గంగాధర్, ముత్తన్న పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండల కేంద్రంలోని భవిత విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. మొతం 21 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించినట్లు ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మంగళవారం భవిత విద్యావనరుల కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహిస్తామని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐఆర్‌టీ భూమన్న, రాము సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దర్జీల దినోత్సవం

లోకేశ్వరం: మండలకేంద్రంలోని మేరు సంఘ భవనంలో మంగళవారం టైలర్స్ డేను దర్జీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్జీలకు జిల్లా మేరు సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ కత్తెర, టెపులను అందించారు. మేరు సంఘం మండలాధ్యక్షుడు గంగాధర్, సభ్యులు సాయన్న, శివరాం, సాయినాథ్, రమేశ్, నారాయణ ఉన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో మంగళవారం దర్జీల దినోత్సవం నిర్వహించారు. రెడీమేడ్ దుస్తుల రాకతో తమకు ఉపాధి కరువైందని.. ప్రభుత్వం రాయితీ రుణాలిచ్చి ఆదుకోవాలని కోరారు. దర్జీ సంఘం సభ్యులు సాయికుమార్, నర్సయ్య, సాయినాథ్, శ్రీనివాస్, సాయన్న తదితరులు ఉన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- నేటి నుంచి భైంసా శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు
- 4న కల్యాణం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ



భైంసాలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరాలయం

భైంసాటౌన్: భైంసాలోని మహాలక్ష్మి జువెల్లరీ మార్కెట్ ప్రాంతంలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వరాలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈనెల ఒకటో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి. చక్రవర్తుల సుధన్వాచార్య స్వామి ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఏటా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సారి జరిగే 17వ వార్షిక ఉత్సవాలకు.. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

ఉత్సవాలు ఇలా..

- ఈనెల ఒకటో తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి ఉత్సవ అనుజ్ఞ, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, మంగళశాసనం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.
- ఈనెల 2న ఉదయం 8 గంటల నుంచి దీక్షా స్వీకారం, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, బహిహరణం, తదితర కార్యక్రమాలు.
- 3న ఉదయం గంటలకు శాంతిపాఠం, మూలమంత్ర హవనం, నిత్య పూర్ణాహుతి, నివేదనం. సాయంత్రం 5.30 గంటలకు విష్ణు సహస్ర నామ పారాయణం, ఏడు గంటలకు సామూహిక లక్ష్మీ కుంకుమార్చన.
- 4న ఉదయం 10 గంటలకు శ్రీదేవి–భూదేవి సహిత ఎదుర్కోలు సన్నాహకం. 11 గంటల నుంచి వేంకటేశ్వర స్వామి కల్యాణం, అనంతరం అన్నదానం, సాయంత్రం ఆరు గంటలకు తిరువీధి ఉత్సవం.
- 5న ఉదయం శాంతిపాఠం, సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు.
- 6న ఉదయం మహా పూర్ణాహుతి, చక్రస్నానం, సాయంత్రం పుష్పయాగం, మహాకుంభప్రోక్షణ, ఉత్సవ సమాప్తి నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: గిరిజనులు అనాదిగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు రాష్ట్రప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జె.రాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సత్తనపల్లిలో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అటవీ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ రూ.లక్ష లోపు రుణమాఫీతోపాటు పసుపు పంటకు మద్దతు ధర, ధరణి పోర్టల్‌తో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.సర్దార్, గోపి నర్సయ్య, సునారికారి రాజేశ్, వెంకటేశ్, విలాస్, తదితరులు ఉన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

ఖానాపూర్: వరంగల్ పీజీ వైద్య విద్యార్థిని ప్రీతికి దళిత, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పాతబస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అంతకముందు జగన్నాథ్‌రావు చౌరస్తా నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. ప్రీతి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఖానాపూర్: కాకతీయ మెడికల్ కాలేజీ పీజీ విద్యార్థిని ప్రీతి మృతికి కారణమైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉన్నత వర్గాలకు ఒక న్యాయం, వెనుకబడిన వర్గాలకు మరో న్యాయం అనేలా రాష్ట్రంలో పాలన సాగుతుందన్నారు. ప్రీతి మృతిపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.